క్లుప్తంగా

విద్యార్థులకు షూ, టైలు పంపిణీ



షూ, టైలతో విద్యార్థులు

దహెగాం: మండలంలోని బీబ్రా ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు శనివారం షూ, టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండ క్రిష్ణమూర్తి మాట్లాడుతూ ఎన్ఆర్ఐల సహకారంతో 160 మంది విద్యార్థులకు సామగ్రి అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ దిగువ జ్యోతి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కుర్షీద్ బేగం, కంబాల జయేందర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెంపుడు పందులకు వ్యాక్సినేషన్

పెంచికల్‌పేట్: మండలంలోని పోతెపల్లి గ్రామంలో పెంపుడు పందులకు పశువైద్యాధికారి రాకేశ్ ఆధ్వర్యంలో శనివారం క్లాసికల్ స్వైన్ ఫీవర్ వ్యాక్సిన్ వేశారు. ఆయన మాట్లాడుతూ పందుల్లో వచ్చే వైరస్ నివారించడానికి ముందస్తుగా వ్యాక్సిన్ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని పందుల పెంపకందారులు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి చంద్రమౌళి, సిబ్బంది శివ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

జైనూర్: మండల కేంద్రంలో సీసీఐ ఆధ్వర్యంలో రెండు జిన్నింగ్‌లలో పత్తి పంట కొనుగోళ్లను ఈ నెల 24, 25 తేదీల్లో నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆది, సోమ వారాల్లో పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు గమనించి మంగళవారం నుంచి పత్తి అమ్మకానికి తీసుకు రావాలని సూచించారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం చేస్తున్న సకారాం

కెరమెరి: మండలంలోని ఖైరీ గ్రామానికి చెందిన అగ్ని ప్రమాద బాధితులకు శనివారం మాలి సంఘం మాజీ మండలాధ్యక్షుడు సెండే సకారాం రూ.2 వేలు ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట సర్పంచ్ ఆదే నారాయణ తదితరులు ఉన్నారు.

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న అనక దేవేందర్

కెరమెరి: మండలంలోని ముర్కిలొంక, చిన్నుగూడ, దుబ్బగూడ, కెస్లాగూడ గ్రామాల్లో అత్యంత వెనుబడిన ఆదిమ తెగలు కొలాంలకు శనివారం అనక దేవేందర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 100 కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ అనక దేవెందర్, సభ్యులు సిడాం రాజు, ఆత్రం తుకారాం, మారుతి, సిడాం చందు, జంగు తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కొత్తఅనుకోడ, అనుకోడ, మండువ గ్రామాల్లోని గిరిజనులకు శనివారం ప్రేరణ, సహృదయ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రేరణ ఫౌండేషన్ చైర్మన్ శరత్ సుదర్శి మాట్లాడుతూ దాతల సహకారంతో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు బిందు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుర్గం విస్తారు, ఉపాధ్యాయులు వినోద్‌కుమార్, బలరాం, రవీందర్, మాజీ సర్పంచ్ పుల్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజనులకు ప్రాధాన్యం ఇవ్వాలి

వెన్నెల: స్థానిక సంస్థాగత ఎన్నికల్లో దళిత, గిరిజనులకు ప్రాధాన్యతనివ్వాలని, నామినేటెడ్ పదవులు కల్పించాలని శనివారం తెలంగాణ ఆదివాసీ రాష్ట్ర గిరిజన మహిళా నాయకురాలు ఎరగటి లక్ష్మి, నేతకాని సంఘం జిల్లా కార్యదర్శి గట్టు బానేష్ కోరారు. ఎస్సీ, ఎస్టీలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పిస్తేనే అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తారన్నారు. ప్రభుత్వం దళిత గిరిజనులపై ప్రత్యేక దృష్టి సారించి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గట్టు రాజం, దుర్గం గంగయ్య, సంతోష్, రాజలింగు, మేకల వనిత, గోమాస లింగయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు



సిర్పూర్(టి): శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయంలో బాలాజీ వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగ, పద్మవతి అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఏఎంసీ మాజీ చైర్మన్ పర్లపెల్లి వనజ, మాజీ వైస్‌చైర్మన్ కుందారపు శంకరమ్మ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రంగు మహేష్‌గౌడ్, సర్పంచులు అహల్యాదేవి, పోషమల్లు, మల్లేష్, ఎంపీటీసీ మదునయ్య, బీఆర్ఎస్ నాయకులు పందిర్ల మధునయ్య, ఆనంద్, వినోద్ జైస్వాల్, దుర్గం భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సిర్పూర్(టి): మండలంలోని ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పర్వదినాన భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని టోంకిని గ్రామంలోని శ్రీ సిద్ధి టోంకిని హనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనాలు చేసుకున్నారు. మండల కేంద్రంలోని ఆలయాలతో పాటు మండలంలోని గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

వైకుంఠ ఏకాదశి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే

బెజ్జూర్: మండల ద్రంలోని శ్రీ రంగనాయక ఆలయ ప్రాంగణంలో శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకల్లో సిర్పూర్(టి) మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి పాల్గొని పూజలు నిర్వహించారు. రంగనాయక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు పంచామృతాలతో ఆలయంలో స్వామివారిని అభిషేకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండ్ర మనోహర్‌గౌడ్, నాయకులు రాజారాం, తిరుపతి, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఓంకార ఆశ్రమంలో వైకుంఠ ఏకాదశి

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి గ్రామంలో గల ఓంకార ఆశ్రమంలో శనివారం వైకుంఠ ఏకాదశి పూజలు, గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన శ్రీ విష్ణు దేవానందగిరి స్వామి, శ్రీ సదాశివానందగిరి స్వామి, శ్రీ అభేదానందగిరి స్వామి, శ్రీ జగదీశ్వరానంద స్వామిల ఆధ్వర్యంలో ఆశ్రమంలో భక్తి ప్రవచనాలు, బోధనలు నిర్వహించారు. భక్తులకు పూజా నియమాలు, వ్రత నియమాలు బోధించారు. ఈసందర్భంగా గీతాపూజ, లలిత సహస్రనామ పారాయణం, గీతా యజ్ఞం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి, సర్పంచ్ చౌదరి నానయ్య, నాయకులు ఎల్ములె మల్లయ్య, భక్తులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌టౌన్: పూజలు చేస్తున్న భక్తులు

పోటెత్తిన భక్తజనం..

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో గల శ్రీ లక్ష్మి నారాయణ స్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవంలో భాగంగా శనివారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బెజ్జూర్: పూజలో పాల్వాయి రాజ్యలక్ష్మి



రెబ్బెన: దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



చింతలమానెపల్లి: హోమం నిర్వహిస్తున్న భక్తులు

వార్షికోత్సవానికి ముస్తాబు..!



ముస్తాబైన సదాశివపేట శివాలయం

- సదాశివపేట శివాలయంలో వేడుకలు
- మూడు రోజులపాటు ఉత్సవాలు

కౌటాల: మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయ 50వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. స్థానిక శివాలయంలో స్వయంభుగా వెలిసిన ఈశ్వరుడికి నేటి నుంచి పంచాశత వార్షికోత్సవాలు ఘనంగా జరుపనున్నారు. దీంతో శివాలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. ఆలయంలో హోమం నిర్వహించేందుకు గుండాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

మూడు రోజుల పాటు..

పంచాశత వార్షికోత్సవంలో భాగంగా ఆలయంలో మూడు రోజుల పాటు ఆలయ ప్రధాన అర్చకుడు అంబేద శంకరయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 24న ఆదివారం ఉదయం శివుని ఆరాధన, హారతి, గ్రామ దేవతలకు ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం ప్రత్యేక పూజలతో శివాలయం నుంచి పార్వతి పరమేశ్వరుల పల్లకి ఊరేగింపు కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం వరకు నిర్వహిస్తారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదాన నిర్వహిస్తారు. రెండోరోజు సోమవారం శివాలయంలో ఉదయం శివుని ఆరాధన, హారతి, అఖండ దీపారాధన, గణపతి పూజ, స్వస్తి వచనము, నవగ్రహ ఆరాధన, పంచకలశ ఆరాధన, అంకురార్పణ, రుద్రాభిషేకం, ధ్వజారోహణ, మహాగణపతి హోమం, అగ్ని ప్రతిష్ఠ, హారతి మంత్రపుష్పము, లక్ష దీపోత్సవ కార్యక్రమం, మహా రుద్ర హోమ హారతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, వీరభద్ర, భద్రకాళి పూజలు నిర్వహిస్తారు. రాత్రి ఆలయంలో అగ్నిగుండ భూమి పూజ, అగ్నిగుండముల ప్రజ్వలన నిర్వహించనున్నారు. ఈ నెల 26న ఉదయం ఆలయంలో ఉదయం 5 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, రుద్రహోమం, పూర్ణహుతి, ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



కౌటాలలోని శివాలయానికి 50 ఏళ్లు పూర్తయ్యాయి. దీంతో నేటి నుంచి మూడు రోజుల పాటు పంచాశత ఉత్సవాలను నిర్వహించనున్నాం. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయంలో మహాగణపతి హోమం, అగ్నిగుండాల ప్రవేశం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తాం. మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి.

– అంబేద శంకరయ్య, ప్రధాన అర్చకుడు

'కార్మికుల కోసం పోరాడే సీఐటీయూని గెలిపించండి'



మాట్లాడుతున్న నాగరాజు గోపాల్

రెబ్బెన: కార్మికుల దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం యాజమాన్యంతో పోరాడే సీఐటీయూను సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించాలని సీఐటీయూ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నాగరాజు గోపాల్ అన్నారు. శనివారం గోలేటి సీహెచ్‌పీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ గుర్తింపు సంఘంగా గెలిచి వన్‌టైం అగ్రిమెంట్లు చేసిన ఏఐటీయూసీ వంటి సంఘాలను ఓడించి కార్మికుల దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం పోరాడే సీఐటీయూని గెలిపించాలని కోరారు. గతంలో ఏఐటీయూసీ చేసుకున్న వన్‌టైం అగ్రిమెంట్ల మూలంగా మైనింగ్ సిబ్బందికి, ట్రేడ్‌మెన్‌లకు క్యాడర్ స్కీం, సర్ఫేస్‌లో ఉద్యోగాల విషయంలో జరిగిన నష్టాన్ని గుర్తుంచుకోవాలన్నారు. క్వాటర్లు, డిప్యూటేషన్లు, ట్రాన్స్‌ఫర్ల పైరవీలతో కార్మికులను దోచుకుంటున్న సంఘాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇన్‌చార్జి అంబాల ఓదెలు, నాయకులు రమణయ్య, అల్లి రాజేందర్, చైతన్యరెడ్డి, సిద్దంకి సత్తయ్యలు పాల్గొన్నారు.

క్రైస్తవులకు కానుకలు పంపిణీ



కాగజ్‌నగర్‌టౌన్: కానుకలు పంపిణీ చేస్తున్న ఆర్‌డీవో



కౌటాల: క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఎస్పీఎం చర్చ్ మైదానంలో శనివారం క్రైస్తవులకు ప్రభుత్వం మంజూరు చేసిన క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు. కాగజ్‌నగర్ ఆర్‌డీవో కాశబోయిన సురేశ్, తహసీల్దార్ కిరణ్ కుమార్ చేతుల మీదుగా కానుకల కిట్లు అందజేశారు. ఆర్‌డీవో సురేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిణి రమాదేవి, క్రైస్తవ సంఘాల పదాధికారులు, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఇతరుల పట్ల ప్రేమ కలిగి ఉండాలి..

కౌటాల: ప్రతి ఒక్కరు యేసు క్రీస్తు మాదిరి ఇతరుల పట్ల ప్రేమ కలిగి జీవించాలని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శనివారం మండలంలోని విజయనగరం గ్రామంలోని కథోలిక్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ యేసుక్రీస్తు చూపిన శాంతి మార్గంలో ప్రజలు నడవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బసార్‌కర్ విశ్వనాథ్, ఎంపీటీసీ వసంత్‌రావు, సర్పంచ్ రాందాస్, ఫాదర్లు సీజో, టామో పాల్గొన్నారు.

ధనోరాలో ఘనంగా రైతు దినోత్సవం



రైతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామంలో గల రైతువేదికలో శనివారం ఘనంగా రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పెందోర్ మోతిరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్‌కలాం మాట్లాడారు. రైతు చల్లగా ఉంటేనే మానవ మనుగడ సాధ్యమన్నారు. రైతులు పాత పద్ధతుల్లో కాకుండా కొత్త సాంకేతిక పద్ధతులను అవలంభించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులను సన్మానించారు. సర్పంచ్ చిలుక, భీంరావు, న్యానేశ్వర్, ఉపసర్పంచ్ రిజ్వాన్, రైతు సమితీ అధ్యక్షుడు కేంద్రె బాలాజి, నాయకులు ఆత్రం కుసుంబ్‌రావు, పెందోర్ జలపతి, దుందే రావు, అనక దేవ్‌రావు తదితరులు ఉన్నారు.

108లో ప్రసవం



శిశువును కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న ఈఎంటీ శ్రీకాంత్

రెబ్బెన: మండలంలోని రోళ్లపాడుకు చెందిన గర్భిణీ 108 అంబులెన్సులో ప్రసవించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఈఎంటీ శ్రీనివాస్, పైలెట్ సంతోష్‌లు తెలిపిన వివరాల ప్రకారం రోళ్లపాడుకు చెందిన గర్భిణీ మానసకు శనివారం పురిటినొప్పులు రాగా కుటుంబ సభ్యులు 108లో రెబ్బెన పీహెచ్‌సీకి తరలిస్తున్న క్రమంలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. దాంతో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి వైద్యుల సూచనల మేరకు ఈఎంటీ శ్రీకాంత్ మానసకు అంబులెన్సులోనే పురుడు పోయటంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారు.

సిద్ధమవుతున్న నర్సరీలు..!

- మండలంలోని 27 జీపీల్లో ఊపందుకున్న పనులు
- మూడు లక్షల మొక్కల పెంపు లక్ష్యం



బ్యాగుల్లో మట్టి నింపుతున్న కూలీలు

ఆసిఫాబాద్‌రూరల్: ఊరూరా పచ్చదనం కనిపించేలా పర్యావరణ పరిరక్షణకు గత ప్రభుత్వం హరిత హారం కార్యక్రమం తీసుకొచ్చింది. ఏటా జూన్ మాసంలో మొక్కలు నాటేందుకు ప్రతీ గ్రామపంచాయతీలో వన నర్సరీలు ఏర్పాటు చేసింది. హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఇప్పటి నుంచే గ్రామ పంచాయతీల్లో నర్సరీలు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీలో 10వేల నుంచి 20వేల మొక్కలు నాటేందుకు ఆయా నర్సరీల్లో బ్యాగుల్లో మట్టి నింపే పనులు చేపడుతున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 3లక్షల మొక్కలను నాటేందుకు 27 గ్రామ పంచాయతీలకు సంబంధించిన నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేస్తున్నారు.

ఊపందుకున్న పనులు..

మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో నర్సరీల్లో పనులు ఊపందుకున్నాయి. నర్సరీలు ఏర్పాటు చేసే స్థలాల వద్ద మట్టి కుప్పలు పోయించి ఉపాధికూలీలతో ప్లాస్టిక్ సంచుల్లో మట్టిని నింపే ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. వాటిని సంరక్షించేలా ఆయా శాఖల అధికారులు భాగస్వామ్యం కీలకంగా మారింది. మండల ప్రత్యేకాధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఉపాధిహామీ ఏపీవోలు, సిబ్బంది నిత్యం నర్సరీలను పర్యవేక్షిస్తున్నారు. విత్తనాలు ఉన్న సంచుల్లో నీటిని చల్లించడంతోపాటు పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేస్తున్నారు.

జీపీల వారీగా ఇలా..

ఆసిఫాబాద్ జీపీలో 20వేల మొక్కలు, చిలాటిగూడలో 10వేలు, కౌటగూడలో 10వేలు, గవిండ్‌పూర్‌లో 10వేలు, మాలన్‌గొందిలో 10వేలు, సాలేగూడ, అంకుసాపూర్, చిర్రకుంట, మోవాడ్, రహపల్లి, ఇదులవాడ, వెంకటపూర్, ఆడ, తుంపెల్లి, అడదస్నాపూర్, గుండి, బాబాపూర్, కోసారా, మోతుగూడ, బూర్గుడ, అప్పపల్లితో పాటు మిగతా గ్రామ పంచాయతీల్లో 12వేల చొప్పున మొక్కలను పెంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మొక్కల సంరక్షణ అంతంతే..

నర్సరీల్లో పెరిగిన మొక్కలను హరితహారంలో భాగంగా జూన్, జూలై నెలల్లో ఆయా గ్రామాల్లో నాటుతున్నారు. కానీ వాటి సంరక్షణ మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. మొక్కలను సంరక్షించకపోవడంతో కోట్ల రూపాయల నిధులు వృధా అవుతున్నాయి. నర్సరీలో పెరిగే ఒక్కో మొక్కకు రూ.108లు ఖర్చు చేస్తున్నారు. గుంత తీయడానికి రూ.27, నర్సరీ నుంచి పల్లె ప్రకృతి వనానికి రవాణా ఖర్చు రూ.1.14 (ఒక మొక్క), నాటడానికి రూ.16 వెచ్చిస్తున్నారు. ఒక్కో మొక్కకు నీళ్లు పట్టడానికి రూ. 1.80 నిర్వహణ ఖర్చు చేస్తున్నారు. ఈ విధంగా ఒక్కో మొక్కకు రూ. 80.94 వ్యయం చేస్తున్నారు. కాని వేలాదిగా నాటిన మొక్కలను ఎవరు లెక్కిస్తారనే ధీమాతో అధికారులు పచ్చదనం మాటున లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కానీ మొక్కలు సంరక్షించలేక పోతున్నారు. పల్లె ప్రకృతి వనం మినహాయించి రోడ్డుకిరువైపులా నాటిన మొక్కలు మాత్రం కనిపించడం లేదని విమర్శలు వస్తున్నాయి.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



దయానంద్ (ఫైల్)

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న దయానంద్ (55) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. నజ్రూల్‌నగర్ మార్కెట్‌కు వెళ్లిన దయానంద్ ఒక్కసారిగా కుప్పకూలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

మహిళా సాధికారతపై అవగాహన సదస్సులు

బెల్లంపల్లి: మహిళా సాధికారతపై బెల్లంపల్లిలో శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రభుత్వ మైనార్టీ బాలికల గురుకుల కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వేరువేరుగా సదస్సులు నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో వక్తలు విజయ, మౌనిక మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైమ్ అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం పాలక ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను వివరించారు. అత్యవసర సమయాల్లో హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సదస్సులో మైనార్టీ బాలికల గురుకుల కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ ఎదుట గల ఐటీఐ కళాశాల ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మితో కలిసి అందజేశారు. ఎంపీపీ మంగ, జెడ్పీటీసీ రవి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కిరణ్ కుమార్, నూతన మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.రాజేశ్‌లను శనివారం కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో సహకరించాలని కోరారు.